అపస్వరాలు—(1)

# సరిగమ

(కథానిక)

పెరటి వసారాలో పనిమనిషి పేడతో అలికిన అరుగుమీద 'మారేడుదళం' ముగ్గు పెడుతోంది. మునగచెట్టు కింద ముక్కాలి పీట మీద కూర్చున్న పార్వతి దానితో సంభాషణ మొదలు పెట్టింది

"ఏమే, నీకు జీతమెంతే?"

"అందరూ యిచ్చేదే తల్లీ-మునుపీ యింట్లో ఉండే అమ్మగారూ అదే యిచ్చేవారు. నెలకి రెండున్నరిస్తారు."

"నీ కెందరే పిల్లలూ?"

"ముగ్గురమ్మా! యిద్దరాడోళ్లూ, ఓడు మొగోడూను"

"నీ మొగుడేమాత్రం సంపాదిస్తాడే?"

"ఊరుకుంటే అంతే సాలు తల్లీ! మూడేళ్ళ కిందట గైరమ్మ తీరథంలో తాగే బండికింద పడి రెండు కాళ్ళూ యిరక్కొట్టుకున్నాడు. యింట్లో కూకుని తెచ్చేదల్లా తాగేస్తాడు."

"అదేమిటే మహాలక్ష్మీ, తాగేస్తే పట్టు కోరటే?"

"ఏటో సత్తికాలం వనిసివమ్మ అలాటవి పట్నాల్లోనేగాని యిలాంటి పల్లెల్లో ఎవడు సూడొచ్చాడు? మేం తాగేమని పబ్లిగ్గా సెప్పి మరీ తాగుతుండను ముండకొడుకులు ఏం ప్రభుత్వవో ఆరి మాటెవరిన్నారమ్మగారూ!"

"అయితే రెండున్నరతోటే మీ సంసారం వెళ్ళిపోతోందిటే?"

"మా ఆడదాయిలు ఉడుపుల కెళ్ళిపప్పులూ అవీ యిసిరీ ఏదో పైన తెస్తాంటారు లెండి. అటుపైని మీలాంటి దర్మాత్ములు యింత వణ్ణం పడేసీ చిరిగిన పాత గుడ్డ వేసీ, ఎలాగో యీడుస్తున్నాం గాని బరు కట్టంగందమ్మా"

మహాలక్ష్మి ఆ పని పూర్తిచేసి అగ్గిపెట్టి అడిగి నీళ్ళ పొయ్యి అంటించటానికి వెళ్ళింది. పార్వతి ఏదో ఆలోచిస్తూ పంగు పుల్ల నములుతూండగా "కిర్ర్"ని తలుపు తీసుకు లేచివచ్చాడు ప్రకాశరావు. వస్తూనే ముక్కు మూసుకుని—

"అబ్బా! ఏమిటీ పేడకంపూ? ముక్కు బద్దలయిపోతూంది. నేను యింట్లో ఉండగా యిల్లు అలకవద్దని నీ కెన్నిసార్లు చెప్పాలి మహాలక్ష్మీ!" అన్నాడు. ఈ మాటకు పార్వతి జవాబు చెప్పింది.

"పక్కమీంచి లేచీలేవగానే పాచిమొహాన బెడ్ కాఫీ ఆరగిస్తున్నప్పుడు అప్పుడే వాసనా లేకపోయిందేం? కుళ్లు కాలువలను ఆనుకున్న కాఫీహోటళ్లలో ఫలహారాలు ఆరగిస్తున్నప్పుడు మనకే కంపూ కొట్టనేదేం? చీమలూ దోమలూ రాకుండా శుచిగా పేడతో యిల్లు అలికిస్తే అసహ్యం వేసిందా మీకు? అయినా విజయనగరం పెద్దచెరువు దోమలతో బాగా పరిచయమున్న మీకు అలా లేకుండా చెయ్యడం కష్టంగానే ఉంటుంది మరి!"

ప్రసాదరావు జవాబు చెప్పలేక ఓ చిరునవ్వు యివతలకు రానిచ్చి, ముక్కుతోపాటు చెవులు కూడా మూసుకుని వీధిలోకి వెళ్ళిపోయాడు.

పాపాయి పడుకున్న గదిలోకివచ్చి పార్వతి కిటికీ తలుపులు తెరిచింది. సౌందర్యభరితమైన ప్రకృతిదృశ్యం చూడగానే ఆమె మనసు పులకాంకితమయింది. ఎంత అందంగా ఉంది ఆ దృశ్యం? రాత్రి మంచుకి తడిసి సూర్యకిరణాలకు తళతళ మెరుస్తున్న వరిచేలూ, ఆ వెనుక పచ్చని నువ్వుమొక్కల చివర తెల్లని పువ్వులూ-మంచులో మాయమై అస్పష్టంగా కనిపిస్తున్న నీలపుకొండలూ "ప్రకృతి పరిశీలనలో పడిపోయారు కాబోలు- చెంబుడు వేడినీళ్లు తెచ్చి పెట్టమని మనవి" ఈమాటలకి పార్వతి నవ్వుతూ యిటు తిరిగి నీళ్లు తీసుకు వీధిలోకి వెళ్ళింది.

అవసరాల రామకృష్ణారావు

ఇంతలో పాపాయి లేచేడు కొబోలు పరిచిత రాగం వినిపించింది.

"లేచేవా, నాయనా? ఏం మునిగిపోయిందనీ అంత త్వరగా లేచేవు! ఒక్క పని అవలేదు కదా- సరేలే, ఏడుస్తున్నావ్?"

పాపాయి అమ్మని చూడగానే రాగం పెద్దది చేస్తూ "అమ్మా ..కుక్కపిల్ల .." అన్నాడు.

"ఓరి వీడి జ్ఞాపకం బంగారంగానూ! నిజానికి వాళ్ళకున్న జ్ఞాపకశక్తి మనకుండదుసుమా! విన్నావుటే మహాలక్ష్మీ. నిన్న నీ మొగుడు వీడికి కుక్కపిల్ల తెచ్చి పెడతానన్నాడు. లేచీ లేవగానే అదేమాట. బాగుందా? అలానే తెమ్మంటానులే బాబూ- లే మొహం కడుగుతాను రా."

పార్వతి పాపాయికి మొహంకడుగుతూంటే మహాలక్ష్మి మొగుడు సూర్యనారాయణ ఎర్రగన్నేరు చెట్టుకి గొప్పు తవ్వడం మొదలెట్టేడు.

"నీ మొగుడుకి కాళ్లు లేకపోయినా అలాగే యీడ్చుకు వచ్చి చాలా పనులు చేస్తాడు సుమీ మహాలక్ష్మీ."

"కాస్త బుద్ధిగలిగుండి తాగడం మానెయ్యమని సెప్పండమ్మగోరూ - ఏం శాతకానోడు గనుకనా? అన్ని పనులూ సేతనవును లేకపోతే ఇంత సంసార మెలా ఎడుతోందమ్మగోరూ?"

"ఏంవోయ్, అదేంపనోయ్, కడుపునిండనా కాల్నిండనా? ఎందుకో తాగుడు? నువ్విలా చేస్తున్నావని తెలుస్తే అయ్యగారూరుకోరు సుమా! నువ్వు సంసారం చూసుకోపోతే ఆదొక్కర్తే ఏం చెయ్యగలదు?"

సంభాషణ యింకోవైపు పోడం, తనమాటే మరచిపోడం పాపాయి భరించలేకపోయాడు.

"అమ్మ కుక్కపిల్లే, అబ్బని తెమ్మనవే" అన్నాడు గునస్తూ.

"ఏంవోయ్ సూర్నారాయణా ఏరక్కపోయి చెప్పేవు యీ వూళ్ళో కుక్క పిల్లలున్నాయని. మావాడు లేచిందగ్గిర్నుంచీ తినేస్తున్నాడు. కాస్త మంచి దాన్ని చూసి తెచ్చిపెడదూ! ఓటి ఎలాగా సంపాదిద్దా మనుకుంటున్నాం లే. మా తమ్ముడు బెంగుళూర్నుంచి వస్తూంటే తెమ్మని రాశాను. వాడు మరచిపోయాడని వీడు అప్పట్నుంచీ నానా గోలా చేసున్నాడు[illegible]ంగా మంచివే ఉన్నా యేమిటి?"

"ఓ-మా పసందైన 'పిల్లలున్నాయి బుల్లెమ్మగారూ మజ్జాన్నం తెస్తాను."

"ఇప్పుడే కావాలి" అంటూ బిక్క మొహం వేసేడు పాపాయి. కోపంతో పాపాయి తల ఒమారు గుంజాయించి "వెధవ-అనగానే షని జరిగిపోవాలి. ముందు చేతులు కడుక్కుని వెళ్ళిరా సూర్నారాయణా" అంది పార్వతి విసుగ్గా. సూర్నారాయణ వెళ్ళిపోయాడు యీడ్చుకుంటూ.

"ఇంకా ఎన్నిపనులో చేస్తాడమ్మగోరూ, మీరొచ్చారని ఒచ్చినోడుగాని బుర్ర కుదురు లేదు మడిసికి, ఎదేనా పట్నం ఎల్లిపోదా మనుకుంటున్నా మమ్మగోరూ."

పార్వతి ఏదో అడుగుదా మనుకుంటూండగా "పార్వతీ" అని పిలుపు వినిపించింది. పార్వతి లేచి వెళ్ళింది వీథిలోకి. ప్రకాశరావు చేతిలో ఏదో కాగితముంది. "పోనీ, లారీ ఎలాగా వస్తోంది కదా అని అన్ని సామానులూ తెచ్చేసుకున్నాం. ఉండడాని కదృష్ట ముండొద్దూ?" అన్నాడు ప్రకాశరావు.

"ఏమిటిది?" అంది పార్వతి ఆత్రుతగా.

"మా పై సూపరెండెంటు అర్జంటుగా రమ్మని కబురంపేడు. పక్క గ్రామంలో ఉన్నాడు."

"మళ్ళీ ఎన్నాళ్ళకొస్తారు?"

"ఏమో ఆయనదయ. ఆయనతో కూడా కేంపులకు వెళుతూ యిన్స్పెక్షన్ చెయ్యాలి."

"అయితే ఏమంటారు?"

"నువ్వు మీ నాన్న గారింటికి వెళ్ళిపో. ఇక్కడ ఒక్కర్తివే ఎన్నాళ్ళని ఉంటావు? ఈ మన్యంలో పాలయినా దొరకవు. ఎలా ఉండగలవు?"

"ఏమిటీ, అనుకున్నట్టు ఒక్కటీ జరగదు. నిన్న రావడం యివాళ వెళ్ళిపోవడం, నాలుగు రోజులపాటు సరదాగా ఉన్నట్టయినా లేదు. యీ ఉద్యోగానికి సుఖంలేదు బాబూ. సరే, ఎప్పుడేమిటి మీ ప్రయాణం?"

"ఇప్పుడే. యింకో అరగంటకి సెకండ్ బస్‌లో వెడతాను. నువ్వు యిల్లూ అదీ జాగ్ర

త్తగా తాళాలువేసుకుని రెండింటికిబయలుదేరు. కరణంగారింట్లో మంచి ఎరకం ఎద్దులున్నాయి. కాస్త త్వరగా పరుగెడతాయి. ఆయన నడిగి ఎరేంజ్' చేయిస్తాను. ఆ బండిలో వెళ్ళి శరభారం దగ్గిర బస్ క్రాస్ చెయ్యండి."

"సరే అన్నీ బాగానే ఉన్నాయి కాని..."

ఆ 'కాని'లో అర్థం తెలిసి, ప్రకాశరావు పార్వతి గడ్డం పట్టుకుని పైకెత్తి, దుఃఖాన్ని దాస్తున్న ఆమె కళ్ళని చూసి "ఛా, ఏమిటదీ సాధ్యమైనంత త్వరలో వచ్చేస్తాగా. రాగానే రాస్తానే" అన్నాడు. ఆమె తల వంచుకుని కాఫీ కలపడానికి వెళ్ళిపోయింది.

"ఈ పిల్ల నీ కూతురేమిటే మహాలక్ష్మీ?"

అవునన్నట్టు తల ఊపింది మహాలక్ష్మి 'స్టేండు'మీద బట్టలు పెట్టెలో సర్దుతూ.

"ఇద్దరు ఆడపిల్లలన్నావు కాదుటే?" అంది పార్వతి.

"అవునమ్మా! ఓ దాన్ని మా ఒదినగారి కొడుక్కిచ్చాను, ఇంకిదే మిగిలింది"

"ఏమే, మా పాపాయి నెత్తుకుంటావుటే?" అని పార్వతి అడిగింది.

ఆపిల్ల అలాగే అన్నట్టు తల ఊపింది

"ముప్పొద్దులా నన్నే అంటిపెట్టుకుని తినేస్తున్నాడే వీడు. క్షణం వదలడు. ఒక్కపనీ జరగనియ్యడు. పిల్లనెత్తుకునే పిల్లని పెట్టుకుందామని చూస్తున్నాను మావూరు వస్తావుటే పిల్లా?"

ఆ "కడగని ముఖం" తల్లిని విడిచి రానన్నట్టు తల ఊపింది.

"ఈ పల్లెటూళ్ళో ఎవరూ కూలికైనా పిలవరమ్మగోరూ! ఎలాగా పట్నం వచ్చేద్దామనుకుంటున్నాం, అదొక్కర్తీ ఎలా వస్తుంది? ఏకంగా తీసుకుపోండమ్మగోరూ? తను మనసులో అనుకుంటున్నది మహాలక్ష్మి బయటపెట్టినందుకు పార్వతి ఎంతో సంతోషించింది. ఆమె పుట్టింటారికి ఒక మామిడితోట ఉంది- దాన్ని ఎవరికిచ్చినా బాగా అనుభవించి యజమానులకి యిచ్చేది ఏడుస్తూ యిస్తూ నానా అల్లరీ పెడుతున్నారు. సూర్నారాయణనే అక్కడ పెడితే? ఏం, వాడూ వాడి కుటుంబమూ అక్కడ చిన్న గుడిసేసుకు ఉంటారు. మహాలక్ష్మి యింట్లో పనులు చేస్తుంది. ఇప్పుడు పట్నాల్లో పనిచేసే మనుషులు కూడా మాటకి మాట జవాబుచెప్పి ఎదిరిస్తున్నారు. ఈ మహాలక్ష్మి తెల్లారి ఆయిదింటికొచ్చి అన్ని పనులూ అదే చేసుకుంటుంది. పిల్ల పాపాయిని ఆడిస్తుంది. తన పుట్టింటారు ఏం, ఆమాత్రం పోషించలేని వారు కారు. అంతకన్నా కావలసిందేమిటి?

"ఏమంటారు అమ్మగోరూ?"

మహాలక్ష్మి ఎంతో ఆశగా అడిగింది. ఈ రేషన్ రోజుల్లో ఒక కుటుంబాన్ని యింటి మీదకు వదిలితే అమ్మా వాళ్ళూ ఏమనుకుంటారో! ఏమిటో అనుకోడమేగాని రేషను వచ్చిందని ఏది ఆగింది గనుక? తిండిలేక చచ్చే వాళ్ళు చస్తూనే వున్నారు పదిమందిని పోషిస్తున్నవారు పోషిస్తూనే ఉన్నారు. తనవాళ్ళకి కావలసినన్ని భూములున్నాయి. నాలుగు రోజులు వీళ్ళని పోషిస్తే వాళ్ళ కాళ్ళమీద వాళ్ళే నిలబడతారు. అయినా ఊరికే పోషించాలా యేం?

"అలాగేనే!" ఈమాట వినగానే మహాలక్ష్మి చిన్నపిల్లలా గెంతులు వేసింది. పార్వతి నొసట చేతులు విరిచి "మా యమ్మే! మా బాబే! ఆ పార్వతీదేవి నువ్వే మాతల్లీ!" అంది. దాని వెర్రిఆనందం చూసి పార్వతికి ఎంతో ముచ్చటవేసింది. సరిగ్గా ఆవేళకి ఓ కుక్కని తీసుకొచ్చాడు, "చూసుకోండమ్మగోరూ! బగుబేసయిన పిల్ల! చిన బాబుగారు చూస్తే మరొదలరు" ఆ కుక్కని చూడగానే పార్వతికి పకపకా నవ్వొచ్చింది ఒకటోరకమయిన ఊరకుక్క! సగం కొరికేసినట్టున్న బొచ్చూ, ఒంటినిండా మచ్చమచ్చలూ, మెడమీద చిన్న కురుపూ "బహు పసందయిన పిల్ల! పాపాయి మాత్రం తను తింటున్న బిస్కట్లలో ఒకటి దానిముందు పడేశాడు. అది తోకాడిస్తూ బిస్కట్టు తింటూంటే పాపాయి చేతులాడిస్తూ నవ్వుకుంటున్నాడు? పార్వతి నవ్వు చూసేసరికి సూర్నారాయణ మాత్రం మొహం వేలేసేడు.

"అదేమిటోయ్, సూర్నారాయణా! యిదా నువ్వు పొగిడేకుక్క. పోనీ ఎలాగున్నా చిన్న

పిల్లయితే కొంచెం బాగుండేది. దానితోపాటు కడుపు కూడాను! చాలు ఎవరిదో తీసికెళ్ళి యిచ్చెయ్" అంది పార్వతి. అతను కొంచెం అంత మొహం చేసుకుని "ఎవరిదో ఏమిటి అమ్మా, ఊర్లో కుక్క. చిన్న బాబుగారికి కావాలని తెచ్చినాను — రా" దానికి కట్టిన చేంతాడు లాగేడు సూర్నారాయణ. ఒక బిస్కెటుతోటే పాపాయికీ కుక్కకీ అంత స్నేహం ఏర్పడింది కాబోలు! కుక్క ఎంత లాగినా గోళ్ళతో నేలని పట్టుకుని రానిరాకరించింది. పాపాయి రెండు చేతులతోనూ దాన్ని పట్టుకొన్నాడు.

"ఛా, ఏమిట్రా దాన్ని పట్టుకుంటావు పురుగులు అంటుకుంటాయి. ఛీ వదిలెయ్" అంది పార్వతి. కాని పాపాయి వదల్లేదు.

"సరీగా ప్రయాణపు వేళ మామంచి గొడవ తెచ్చిపెట్టేవోయ్ సూర్నారాయణా! వీడు యిప్పుడు బాకా వదిలితే ఒక్కటీ సద్దుకోనియ్యడు. సరే ఉండనీ తరవాత విడిపించి మరీ ఏదో చెయ్యవచ్చు. మహాలక్ష్మి వేళయిపోతూంది ఇంటికెళ్ళి నాలుగూ సద్దిరా"

"ఏమిటిది?" అన్నట్లు సూర్నారాయణ మహాలక్ష్మివైపు చూశాడు. "రా, మాంచా చెప్తాను" అన్నట్లు చూసింది మహాలక్ష్మి ముందు మహాలక్ష్మి, వెనక కళ్ళొత్తుకుంటూ సూర్నారాయణ వెళ్ళిపోయారు.

*   *   *

"చిన్నక్కొచ్చింది - చిన్నక్కొచ్చింది" ఇంట్లో చిన్నపిల్లలందరూ చప్పట్లు కొడుతూ వీథిలోకివచ్చారు. ముందు పార్వతీ, ఆ తరువాత మహాలక్ష్మి గారీ, రాముడు-తరువాత సూర్నారాయణా ఆఖరికి పాపాయి, కుక్కా జట్కాలోంచి దిగేరు.

"ఇదేమిటి చిన్నక్కా వీళ్ళందరూ ఎవరే?" పార్వతి కొంగుపట్టుకొని పిల్లలు ప్రశ్నార్థకంగా చూస్తూ అడిగేరు. "అదేమిటి పార్వతీ అల్లుడేడీ? ఈ మూకంతా ఏమిటి?" అని అడిగింది అమ్మ పార్వతి జరిగిందంతా అమ్మతో చెప్పింది. "అన్నీ బాగానే ఉన్నాయిగాని యీ ఊరకుక్క ఎక్కడ దొరికిందే?" "ఏమో అది నీ మనవడి కళ్ళకి అప్సరసలా కనిపించింది కాబోలు క్షణం వదిలితే ఒట్టు. ఎండిద్దామని ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితేనా? ఇదంతా నీ మనవడి ప్రభావం అమ్మా" అంది పార్వతి.

*   *   *

నాలుగు నెలలు గడిచాయి. చల్ల గాలులు కొట్టే నేలపైనే వేడిగాలులు ప్రసరిస్తున్నాయి. పార్వతి అనుకున్నట్లు యీ కుటుంబాన్ని తెచ్చినందుకు అమ్మా నాన్నా ఏమీ అనలేదు. వాళ్ళంతా తోటలో గుడిసె వేసుకు ఉంటున్నారు. కొన్నిరోజులు సాధారణంగా గడిచిపోయాయి.

"రాముడు నాలుగు రోజులై స్టోర్సుకు రావడం లేదమ్మా!" అన్నారు నాన్న ఆవేళ యింటికి వస్తూ. పై వాళ్ళతో చెప్పి రాముడికి స్టోర్సులో ఒంట్రోతు పని వేయించారు నాన్న.

"ఏదయినా ఒంట్లో బాగులేదేమో!" అంది పార్వతి.

"లేదు తల్లీ-ఇందాక బజార్లో కనిపించాడు. పక్కకి తప్పించుకుని వెళ్ళిపోయాడు"

ఈ జవాబు విని పార్వతి ఆశ్చర్యపోయింది. వెంటనే తోటలోకి కబురంపించింది. నాలుగు కబుర్లు పంపగా రాముడు వచ్చేడు.

"ఏంరా, రాముడూ నాలుగు రోజులయి స్టోర్సుకి వెళ్ళడం లేదట" ఈ మాటకి అప్పుడే ఎనిమిదింటికి పనిలోకి వచ్చిన మహాలక్ష్మి జవాబు చెప్పింది "వాడూ చిన్నపిల్లాడు కాదు. 'ఒరే' అనబోకండి తల్లీ నొచ్చుకుంటాడు" ఈ మాట విని పార్వతి నిర్ఘాంత పోయింది. స్థానబలిమి ఉన్నంతమాత్రాన మనుషులికి లేని గౌరవం వస్తుందా?

"అలా నిలదీస్తే ఏం చెప్పగలడు అమ్మగోరూ. అయినా చెప్పాలసిన అవసరం ఆపడలేదేమో" ఇలాంటి మాటలు మహాలక్ష్మి నోటంట వస్తాయని పార్వతి ఎప్పుడూ అనుకోలేదు. ఇంత తిరస్కృతి!

"అనవలసిన మాటలు అయిపోయాయా, యింకా ఏమయినా ఉన్నాయా మహాలక్ష్మీ?" అని అడిగింది ఒళ్ళు మండి కోపంగా.

"ఏటమ్మగారూ! అలా ఊరి ఎగిరిపోతుండారు? ఏటి నేను కాని మాటంట? యిల్లు మార్చేసుకుంటున్నాం అందుకని ఆడు రాలేక

పోయివాడు. అయినా యింకీ పని సేయలేడంట."

ఈ పరిస్థితులకి యింత ఉద్ధృత స్థితి వస్తుందని పార్వతి ఏనాటినుంచో అనుకుంటూనే ఉంది. ఓనాటికోనాడు ఆలస్యంగా రావడం, బస్తీ నీళ్లు బాగా పట్టుబట్టి నాగాలు మొదలెట్టడం, ఏదయినా అంటే జవాబులు చెప్పడం పార్వతి గమనిస్తూనే ఉంది.

"అదేమిటే, పాకలోంచి యిల్లు మార్చేసుకుంటున్నారా? ఎక్కడికి?"

"ఎక్కడికేటి? ఎక్కడికో - యింక మా మావ మీ తోటలో పనిసెయ్యలేదు. లోకువవయి ఉన్నాం కదా అని సిన్నసిన్న జీతాలిచ్చి సెయ్యమంటే ఎవడు సేస్తాడు? అమ్మగారోయ్ సెప్పలేదనుకోక, రేపట్నుంచీ నేనుగాని మా పిల్లగాని పనిలోకి రాము రారా, రాముడూ" అని మహాలక్ష్మి వెళ్ళిపోయింది.

ఈ మనుషులెంత కృతఘ్నులు? ఎక్కడో పల్లెలో ఉన్నవాళ్లను తీసుకొచ్చి పనులిచ్చి, బట్టా పాతా యిచ్చి - కుటుంబమంతా భరిస్తే యిదా కృతజ్ఞత?

"అమ్మా! యిలా చూడే!" పాపాయి రెండు భుజాలమీద రెండు కుక్కపిల్లల్ని ఎక్కించి తీసుకొచ్చాడు. వెనక తోకాడిస్తూ తల్లి వచ్చింది. రాగానే పార్వతి చేతిని ప్రేమతో నాకడం ప్రారంభించింది. పార్వతి కుక్కపిల్లల్ని ప్రేమతో తీసుకోపోయింది అవి పాపాయి భుజాలు గోళ్లతో గట్టిగా పట్టుకుని ఊడిరాలేదు. తీసుకువచ్చిం దగ్గర్నుంచీ కుక్క ఒక్కనాడూ పాపాయిని వదలలేదు. ఇప్పుడు దాని పిల్లలూ వదలడంలేదు పూజ్యనీయమైన దాని విశ్వాసానికి పార్వతి రెండు కళ్ళూ నీళ్ళతో నిండిపోయాయి మనుషులకి జంతువులకీ ఎంత తేడా!

అపస్వరాలు—(2)

# ప ద ని స

(క థా ని క)

సత్యమూర్తి

మంగమ్మ రంగుచీర కట్టుకోవడం వీరన్న ఎరగనే ఎరుగడు. మంగమ్మ అలా మగడిక్కలేకుండా అగ్రహారంలో అంట్లుతోమి పొట్ట పోసుకొని రోజు రోజూ ఎదుగుతూన్న వీరన్న పొట్టకూడా పోస్తోంది. వీరన్న తేగలా ఐదేళ్ళు వచ్చేవరకూ తల్లిపాలు తాగుతూనే ఉండేవాడు. "శూద్రపీనుగ" అని అగ్రహారపు ఆడంగులు విసుక్కునేవారు మంగమ్మ అంట్లు తోముతున్నప్పుడు వీరన్న తల్లిపాలు తాగుతున్నప్పుడల్లా. "నా యిష్టం" అన్నట్లు గుడ్లు మిటకరించుకొంటూ చూసేవాడు వీరన్న ఆమాట విన్నప్పుడల్లా వారివైపు. ఆ అగ్రహారంలో సైన్సు మేష్టారు పిల్లలకు అజీర్ణం తెగులు వచ్చి పాడైపోతారని నియమితంగా ఆహారం యివ్వాలని వారి కులకాంతకు బోధిస్తోండేవారు. ఆవిడకు పని తొందరమీద చిరాకుగా ఉండి వీరన్న ఆరోగ్యాన్ని, దినచర్యను ఆధారంగా చేసుకొని ఎదురు వాదించేది. వీరన్న లేచింది మొదలు పొద్దుపోయేవరకూ తల్లికూడా తిరుగుతూ పాలు చప్పరిస్తూనే ఉంటాడు. పైగా అంట్ల గిన్నెలలో పప్పు వగైరా మిగిలితే మంగమ్మ ఆప్యాయంగా వీరన్న చేతులో పెడుతుంది. లొట్టలు వేసుకొంటూ కాజేస్తాడు వీరన్న. అలా నీతీ నియమంలేకుండా వీరన్న ఆహారం తీసుకున్నా దుబ్బులా బలిసి పోతున్నాడు. వీరన్నను ఉదాహరణంగా తీసుకొని కులకాంత, వాదిస్తోంటే సైన్సు మేష్టారి విజ్ఞానమంతా మేలి ముసుగు వేసుకొనేది.

మంగమ్మ అంట్లుతోమడానికి యింటింటా తిరిగేటప్పుడు మోకాళ్ళమీద చేతులు ఆనుకొని వంగి ముందు బరువుమీద గబగబా గునుపు